సంక్రాంతి శోభ
● గ్రామాల్లో పండుగ సందడి
● బంధువుల రాకతో గ్రామాలు కళకళ
● హరిదాసుల సంకీర్తనలు.. పిండి వంటల ఘుమఘుమలు
5
వీవీఐటీ విద్యార్థుల దర్గా టు దుర్గా
అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

కాలు దువ్వుతున్న కోళ్ళు

కత్తికట్టి కాలుదువ్వేందుకు కోళ్ళు సిద్ధమైపోతే కట్టలు తెంచుకుని మరీ పందాలకు కోట్లవిలులైన నోట్లు బయటకు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కేవలం మూడురోజుల్లోనే కోట్లాది రూపాయలు చేతులు మారేందుకు కోడిపందాల బరులు సిద్ధమైపోయాయి. భోగి, సంక్రాంతి, కనుమరోజుల్లో పందాలు వేసుకునేందుకు అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వదిలేస్తుండటంతో దీనిని ఆసరా చేసుకుని కొన్నిచోట్ల ఇప్పటికే జూద క్రీడ కూడా మొదలైపోయింది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో, ఆదివారం నుంచే బరుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పేకాట,కోతముక్క,గుండాట జోరుగా సాగిపోతున్నాయి. కోడిపందాలైతే సిద్ధంచేసిన బరులతో పనిలేకుండా కృష్ణాతీరంలో సముద్రతీరంలోని కొన్నిచోట్ల పందాలు వేస్తున్నారు. తీర ప్రాంతంలో కోడిపందాల విషయంలో తగ్గేదేలేదంటూ పందెం రాయుళ్ళు కూడా నోట్లకట్లను బద్దలుకొట్టి సంప్రదాయ క్రీడపేరుతో పందాల రూపంలో విరజిమ్ముతూనే ఉన్నారు.

- సంప్రదాయం ముసుగులో కోడి పందాలకు సిద్ధం
- భారీగా బరులు, పేకాట శిబిరాలు
- ఒక్కో ఆటకు ఒక్కో రేటు
- తెలంగాణా నుంచీ పందాలకు బారులు
- పోలీసుల ఆదేశాలు బేఖాతరు


చెరుకుపల్లిమండలం తూర్పుపాలెంలో 30ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరులు



తెనాలి, కొల్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో అధికార పార్టీకిచెందిన కీలకనేతలే ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి కోడిపందాలు, పేకాట, లోనాబయట, కోతముక్క, గుండాట ఆడించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఆయా ఆటల నిర్వాహకులకు అప్పగించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా సరే కోడిపందాలు,పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసినా, అందుకు విరుద్ధంగా భారీ బరులను సిద్ధం చేశారు. కొల్లిపర, నాదెండ్ల మండలం సాతులూరు, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం మరికొన్నిచోట్ల బరులను పోలీసులు ధ్వంసంచేశారు. డెల్టాలో మాత్రం బరులు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. వేమూరు మండలం జంపనిలో అయితే ఏకంగా తెనాలి, రేపల్లె ప్రధానరహదారిపై సొంత బారికేడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టివెయ్యటం అధికారుల ఆదేశాల అమలుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పెదకూరపాడు మండలం ముస్సాపురం, అమరావతి మండలం లేమల్లె గ్రామంలో భారీ బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద ఎక్కువ శాతం టీడీపీ,జనసేన జెండాలను,భారీఫ్లెక్సీలను ఏర్పాటు చేసి మరీ సంక్రాంతి సంబరాలకు రారండి అంటూ బహిరంగంగానే ఆహ్వానం పలకటం విశేషం.


కొల్లూరులోని కోడి పందేల బరి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో...

ఉమ్మడి గుంటూరుజిల్లాలోని రేపల్లెనియోజకవర్గం చెరుకుపల్లిమండలం తూర్పుపాలెం,బాపట్లనియోజకవర్గంలోని పిట్టలవారిపాలెంలో, గుంటూరు, పల్నాడు జిలాల్లో అక్కడక్కడ కోడిపందాలు వేసేందుకు బరులను ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులెవరూ పట్టించుకున్న పరిస్థితి తీర ప్రాంతంలో ఎక్కడా కనపడటంలేదు. రేపల్లె నియోజకవర్గం తూర్పుపాలెంలో ఒక వీఐపీ బరి, ఇతరుల కోసం ఏడుబరులు ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట ఆడుకునేందుకు ప్రత్యేక టెంటులను ఏర్పాటు చేశారు.

చెరుకుపల్లినుంచి నగరం వెళ్ళే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారికి నిబంధనలకు విరుద్ధంగా భారీఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ రహదారిలో వెళ్ళే ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనానికి రూ.100లు పార్కింగ్ ఫీజు వసూలు చేస్తుండగా కార్లకు రూ.200లు ఫీజు వసూలు చేస్తున్నారు. వీఐపీ బరుల వద్ద వచ్చే వీఐపీలకు (మిగతా 5వ పేజీలో)

“రేపల్లె నియోజకవర్గంలో కోతముక్క, పేకాట, నెంబర్లాట, రింగ్ ఆట నిర్వహణ, హైదరాబాద్, విజయవాడకు చెందిన వారికి రూ.40లక్షల నుంచి రూ.80లక్షలకు కాంట్రాక్టు అప్పగించారని తెలుస్తోంది. పార్కింగ్ ప్రదేశాన్ని రూ.6లక్షల చొప్పున అధికార పార్టీలోని మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు వేలం పెట్టి రూ.5లక్షలకు పైగానే పాట నిర్వహించారు. బిర్యాని పాయింట్ ఏర్పాటునకు లక్ష రూపాయలు, శీతల పానీయాలు, గుట్కా ఖైనీ, సిగరెట్లు అమ్ముకొనేందుకు లక్ష రూపాయలు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కోడి పందెం బరులు కూడా రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు తదితర కేటగిరీలుగా ఏర్పాటు చేసి ఆయా బరుల్లో ఆ కేటగిరీకి సంబంధించిన వారు పందాలు కాసుకునే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.”

తీరంలో జూలు విదిల్చిన జూదం

కూటమి ప్రభుత్వం పెద్దలకు అత్యంత సన్నిహితుడుగా పేరున్న వ్యక్తి అతను. అయితే రేపల్లె నియోజకవర్గంలో భారీ ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాడు. నగరంమండలం,ఏలేటిపాలెంలోని సపోట తోట మధ్య భారీ షెడ్డు, రేపల్లెమండలం ఉప్పూడి శివారులో భారీషెడ్డును ఏర్పాటుచేసి రాత్రి 7గంటలకు ప్రారంభించి ఉదయం 6గంటల వరకు పేకాట, కోతముక్క నిర్వహిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ఉభయగోదావరి జిల్లాల నుంచి జూదరలు ఇక్కడకు ప్రతి రోజూ వస్తుంటారు. నిత్యం వచ్చే వారికి ఇక్కడ సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇదే నిర్వాహకుడు గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణానది మధ్యభాగంలోని రేవులో రేపల్లెటౌన్, నగరం, నిజాంపట్నం ప్రాంతంలో అప్పటి వైసీపీ నాయకుల అండదండలతో భారీ పేకాట శిబిరాలు నిర్వహించేవారు. ప్రభుత్వం మారినా ఇప్పటి అధికారపార్టీనాయకుల అండదండలతో అతనే పేకాట శిబిరాలు నిర్వహించడం విశేషం. ఇది ఈ మూడు రోజుల తంతు కాదు. ప్రతి రోజూ జరిగే తంతేనని, ఒక్క కోతముక్క ఆటే రూ. 50 లక్షల వరకు ఉంటుంది. బంకినీ రూపంలో అతనికా రోజుకు రూ.2లక్షల వరకు వస్తాయంటే అక్కడ రోజు ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.


తూర్పుపాలెంలో పేకాటకోతముక్క ఆడేందుకు ఏర్పాటు చేసిన గుడారం


తూర్పుపాలెంలో కోడిపందాల బరులవద్ద ఏర్పాటుచేసిన కోతముక్క లోనాబయట పేకాటశిబిరాలు

“పల్లెకోనలో సిద్ధం కాని పందెం బరి

సంక్రాంతి సంబరాలలో భాగంగా భట్టిప్రోలు మండలం పల్లెకోన వద్ద ఏర్పాటు చేసిన బరి ఇంకా సిద్ధం కాలేదు. నియోజకవర్గంలోని మిగిలిన చోట్ల ఏర్పాటు చేసిన బరులలో పందాలు ప్రారంభం కావడంతో ఇక్కడ కూడా బరి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రింబవళ్లు శ్రమించి సోమవారం ఉదయానికి బరి సిద్ధం చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి కుమారుని చేత సంక్రాంతి సంబరాలు ప్రారంభం చేయించనున్నట్లు సమాచారం.”

అదనపు ఆకర్షణగా ఎన్‌ఫీల్డ్ వాహనాలు



కోడి పందాలు బరులు వద్ద ఎన్‌ఫీల్డ్ వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిర్వాహకులు ప్రదర్శనగా ఉంచారు. కొల్లూరు, జంపని కోడి పందాల బరుల వద్ద నిర్వాహకులు ప్రతిపాదించిన పందాలు నెగ్గిన పందెంరాయుళ్లకు ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలు బహుమతులుగా ఇవ్వనున్నారు. గత ఏడాది కొల్లూరు మండలం పెసర్లంక వద్ద ఏర్పాటు చేసిన కోడి పందాల బరిలో రెండు ఎన్‌ఫీల్డ్ వాహనాలను నిర్వాహకులు ఒక్కొక్క కోడి పుంజు ఐదు పందాలు గెలిస్తే ఆయా పందెం రాయుళ్లకు ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేశారు. ద్విచక్ర వాహనాలను బహుమతిగా ఏర్పాటు చేయడంతో ఆయా బరులకు పెద్ద పెద్ద పందాలు కాసే పందెంరాయుళ్లు అధిక సంఖ్యలో వచ్చేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు ఈ పద్ధతి ఎంచుకున్నారు. అసలైన కోడి పందాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఆదివారం మాత్రం నిర్వాహకులు అనధికారిక కోడి పందాలకు తెర లేపారు.


చెరుకుపల్లి: తూర్పుపాలెంలో సిద్ధం చేసిన వీవీపీ కోడిపందాల బరి


కొల్లూరు: పందెం బరిలో ప్రారంభమైన కోడి పందాలు

భోగభాగ్యాల భోగి

పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికే భోగి పండుగ

తెలుగునాట మకర సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అంతటి ప్రాముఖ్యత ఉన్న పండుగను తెలుగు ప్రజలు భోగితో మొదలు పెడతారు. తొలిరోజు భోగి మంటలతో మొదలయ్యే సంక్రాంతి వేడుకలు నాలుగు రోజులపాటు జరుపుకుంటారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో ఇంటిల్లపాదీ పండుగ వేడుకల్లో మునిగి తేలుతారు. అలా ప్రతి ఇంటికి సంతోషాలను స్వాగతించే తొలి పండుగ దినం భోగి కావడంతో దానికి తెలుగునాట ఎంతో ప్రాధాన్యముంది.



గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగునాట పెద్ద పండుగగా జరుపునే సంక్రాంతిని మొదటిరోజు 'భోగి పండుగగా జరుపుకుంటారు. దక్షిణాయణంలో సూర్యుడు రోజు రోజుకూ భూమికి దూరమవడం వలన చలి విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. ఆ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణానికి ముందురోజుకి చలి తారాస్థాయికి చేరుతుంది. దీంతో ఆ చలిని తట్టుకోవడానికి ప్రజలంతా పెద్దగా మంటలు వేసుకుంటారు. కాల క్రమంలో అదే భోగి మంటలుగా ప్రజల సంప్రదాయంలో భాగమైపోయాయి. ఆ భోగి మంటల్లో తాము ఇప్పటి వరకూ పడిన కష్టాలను, బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చి రాబోయే ఉత్తరాయణంలో తమకు సుఖ సంతోషాలను ఇవ్వాలని కోరుతూ భోగి మంట్లో వేడు కుంటారు.

నెల రోజుల పూజా కార్యక్రమాలు

హిందూ మత విశ్వాసాలు, సంప్రదాయం ప్రకారం, మకర సంక్రాంతికి ముందు రోజున భోగి పండుగ వస్తుంది. సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి జనవరి 13, సోమవారం నాడు వచ్చింది. ఈ పండుగను రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమి ళనాడుల్లోనూ జరుపుకుంటారు. అయితే తెలుగునాట జరిగే సంక్రాంతికి ఎంతో ప్రత్యేకత ఉంది. భోగి రోజు నుంచే సంక్రాంతి సంబరాలు మొదల వుతాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆ సందళ్లు తారా స్థాయికి చేరతాయి. దాదాపు నెలరోజులపాటు ధనుర్మాస పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగి పండుగతో సంక్రాంతి వేడుకల్లోకి ప్రవేశిస్తారు. ధనుర్మాసంలో మహిళలు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి ధనుర్మాస వ్రతం ఆచరిస్తారు. యశోదా తనయుడుకి బాల భోగం సమర్పించి హారతి ఇస్తారు. ఆడపిల్లలు నెలరోజులూ ఇళ్ల ముంగిట్లో కళ్లాపు జల్లి రకరకాల రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టి, బంతి, చామంతి, తంగేడు, గుమ్మడి పూలతో అలంకరిస్తారు. శుభ సూచకంగా పసుపు, కుంకుమతో వాటిని పూజిస్తారు. వాటన్నింటికీ ముగింపుగా సంక్రాంతికి ముందురోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేసుకుని చిన్నా, పెద్ద అందరూ ఆ మంటల చుట్టూ చేరి చలికాచుకుంటారు.

భోగి పండుగ రోజున చాలా కుటుంబాల్లో చిన్నారులపై భోగి పండ్లను పోసి పెద్దలు ఆశీర్వదించడం పరిపాటి. అదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పండ్లు)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పండ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారని చాలా మంది నమ్ముతారు. కాగా భోగి పండ్లలో రేగి పండ్లదే అగ్రతాంబూలం. రేగి చెట్టును సంస్కృతంలో బదరీ వృక్షం అంటారు. బదరీ అనేది ఆ శ్రీమన్నారాయణుడికి మరో నామం. ఆయన పేరుకు ప్రతిరూపంగా భావించి రేగి పండ్లను పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. రేగి పండు సూర్యుడికి ప్రీతిపాత్రమైన ఫలం. సూర్యుడి రంగు, రూపు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణాలను కలిపి పిల్లల తలపై పోస్తారు. వాటిని తలపై పోయడం ద్వారా పిల్లలకు ఆ స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. పిల్లలకు ఉన్న దిష్టి తొలగిపోయి వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని పెద్దల విశ్వాసం. ఈ పవిత్రమైన రోజున ఇంద్ర దేవుడు, వరుణ దేవుడిని పూజిస్తారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు.

- నెల రోజులపాటూ మహిళల ధనుర్మాస పూజలు
- భోగి పండ్లు.. భోగి మంటలు.. బొమ్మల కొలువులతో సందడే సందడి
- చలిని తరిమి, వెచ్చదనాన్ని పంచే భోగి మంటలు
- నెల రోజులపాటు ఇళ్ల ముందు రంగవల్లులతో అలంకారాలు
- ఆనందంతో పాటు.. ఆరోగ్యాన్ని ఇచ్చే పండుగ



మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షుపై దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షు లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్స్ట్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాధరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షు, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఆ విషయం మరోసారి రుజువైంది

- బాబీ కొల్లి




బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.





సంక్రాంతి శోభ

● గ్రామాల్లో పండగ సందడి ● బంధువుల రాకతో గ్రామాలు కళకళ ● హరిదాసుల సంకీర్తనలు.. పిండి వంటల ఘుమఘుమలు



క్రోసూరులో గంగిరెద్దుల విన్యాసాలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్‌: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాలు, పల్లెలకు సంక్రాంతి శోభ చేకూరుతుంది. ఎటు చూసినా మహిళలు రంగురంగుల ముగ్గులతో వీధులను అలంకరించే దృశ్యాలు కన్పిస్తున్నాయి. గంగిరెద్దుల విన్యాసాలు వీధుల్లో దర్శన మిస్తున్నాయి. ప్రాతఃకాలంలోనే హరిలో రంగ హరి అంటూ హరిదాసుల సంకీర్తనలు వీనుల విందుగా పల్లె వాసులను నిద్ర లేపుతున్నాయి. వివిధ దేవాలయాల్లో ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తి గీతాలాపనలు, తిరుప్పావై పఠనాలు, పూజారుల మంత్ర పుష్ప వినియోగాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మరో పక్క దూర ప్రాంతాల నుంచి పండగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకొనే బంధువులతో పల్లెలు కళకళ లాడుతున్నాయి. ధాన్యపు నూర్పిళ్లు, కల్లాల్లో కొత్త ధాన్యం తూర్పారబట్టే దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ఎద్దుల మువ్వన్నెల సవ్వడితో దిగుబడులను ఇంటికి చేరవేసే దృశ్యాలు దర్శన మిస్తున్నాయి. శావల్యాపురం మండలం, పోట్లూరు గ్రామంలో గడిపూడి పేరయ్య, కోటమ్మ దంపతుల కుటుంబంలోని సభ్యులు దాదాపు 70 మంది శావల్యాపురంలోని గెస్ట్‌హౌస్‌లో కలవనున్నారు. కొల్లిప రకు చెందిన ఆరిమండ, బొంతు, భీమవరపు, జొన్నల, జంగా, ఉయ్యూరు వంశీయులు ఆదివారం కలుసుకొని సామూహిక భోజనం చేశారు. దోస్త్ ఆధ్వర్యంలో దుగ్గిరాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు.

ఏటా కలిసే సంప్రదాయం

సంక్రాంతి పండగ వచ్చిందటే ఆ గ్రామంలోని ఆ కుటుంబంలోని సభ్యులందరూ కలవాల్సిందే. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ చేసిన పిండి వంటలతో, భోగి మంటల మధ్య సంబరాలు జరుపుకుంటారు. వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలంలోని పోట్లూరు గ్రామంలో గడిపూడి పేరయ్య, కోటమ్మ దంపతుల కుటుంబంలో సందడి వాతావరణం నెలకొంది. పేరయ్య దంపతులకు గడిపూడి నరసయ్య, పున్నయ్య కుమారులతోపాటు మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సయ్య, పున్నయ్య వృత్తి రిత్యా ఉపాధ్యాయులు. నరసయ్య, పాపమ్మ దంపతులకు గడిపూడి వెంటకరాయుడు, నాగేశ్వరరావులతోపాటు ఐదుగురు కుమార్తెలు కలరు. గడిపూడి పున్నయ్య, బాపనమ్మ దంపతులకు హనుమంతరావు, పేరయ్య కుమారులతోపాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరికి చెందిన 18 కుటుంబాలు ప్రతి ఏడాది సంక్రాంతి పండగను పురస్కరించుకొని వారంత పోట్లూరు గ్రామంలోని పూర్వీకుల నివాస గృహానికి చేరుకొని సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. గడిపూడి వెంకటరాయుడు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డ్ అవ్వగా నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ ఏఈగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. వీరందరూ శావల్యాపురంలోని వెంకటరాయుడు గెస్ట్‌హౌస్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. గత ఐదేళ్లుగా మొత్తం 70 మంది సభ్యులు కలిసి భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకుంటారు. భోగి మంటలతోపాటు చక్కటి రంగవల్లులు, గుమగుమలాడే పిండివంటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఒకే వంశానికి చెందిన 70 మంది కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో వారి వారి వృత్తుల్లో స్థిరపడినప్పటికీ సంక్రాంతి పండగకు అందరూ కలిసి కష్టసుఖాలు, యోగాక్షేమాలు తెలుసుకుంటూ శావల్యాపురంలోని గెస్ట్‌హౌస్‌లో కలవడం గమనార్హం.



గత సంక్రాంతికి కలిసిన నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు

ఎల్లలు దాటిన అనుబంధం

ఆ వంశీయుల అనుబంధం ఎల్లలు దాటింది. ప్రతి సంవత్సరం అందరూ సంక్రాంతి పండగకు కలుసుకునే సంప్రదాయంతో గ్రామీణ వాతావరణానికి శోభ చేకూరింది. కొల్లిపరకు చెందిన ఆరిమండ, బొంతు, భీమవరపు, జొన్నల, జంగా, ఉయ్యూరు వంశీయులు ఆదివారం పరస్పరం కలుసుకున్నారు. దూరప్రాంతాలలో ఎక్కడ ఉన్నా ఏటా కలుసుకునే సంప్రదాయాన్ని ఆ వంశస్తులు పాటిస్తున్నారు. తమ ఆడపడుచులను కూడ పిలిచి పసుపు, కుంకుమలతో పాటు బట్టలు పెట్టి దీవించి పంపడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆ వంశీయులు ఆదివారం ఏర్పాటు చేసిన సామూహిక విందు భోజనానికి 11 వేల మంది హాజరయ్యారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన వారు గ్రామంలోని అందరిని కలిసి పరస్పరం క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సామూహికంగా విందు భోజనం చేశారు.



దుగ్గిరాలను అగ్రగామిగా నిలబెట్టవచ్చు

టీ, కాఫీ తాగే అలవాటు కూడా లేని తండ్రికి పెద్దకొడుకునైన నేను కాఫీ ఫ్యాక్టరీ స్థాపించానని, ప్రపంచ ప్రఖ్యాత కాంటినెంటల్ ఫ్యాక్టరీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ అన్నారు. దోస్త్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబారాలను ఆదివారం రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, పోటీలను ప్రారంభించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తన తండ్రి జస్టిస్ చల్లా కొండయ్య తన జీవితంలో టీ, కాఫీ తాగే అలవాటు కూడా లేనప్పటికీ, తనకు కాఫీ ఫ్యాక్టరీ స్థాపించే అవకాశం దేవుడు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దుగ్గిరాలను 1995లోనే దత్తత తీసుకున్నందున సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చామన్నారు. విద్యపరంగా ఎంతో అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దశాబ్దకాలంగా సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్సై ఎస్. వెంకటరవి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి సేవాకార్యక్రమాలు చేపడుతూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేయడం, క్రీడపోటీలు, ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, దోస్త్ ప్రతినిధి చాగర్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దోస్త్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్ బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభించారు. సీసీ ఫ్యాక్టరీ పీఆర్‌ఓ బలరామ్, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, దోస్త్‌కు చెందిన జంపాల సుబ్బారావు, గద్దె శ్రీనివాస్, తె.దే.పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, సర్పంచ్ కుషీబాయి, ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు, సరళాదేవి పీఈటీలు రవి, జమీర్, జంపాల నీరజాక్షి, బి. సంగమేశ్వరరావు, దోస్త్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



దోస్త్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దుగ్గిరాల సీసీఎల్ (కాఫీ ఫ్యాక్టరీ) చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్



కొల్లిపరలో సామూహికంగా భోజనం చేస్తున్న ఆరిమండవారి వంశీయులు

పండగ పిలుపు కోసం వృద్ధాశ్రమంలో నిరీక్షణ

'మా బాబు వస్తాడు, పండగకు తీసుకు వెళ్తాడు, వాడి పిల్లలను చూడాలని ఉంది, వాళ్లతో కలిసి పండగ చేసుకోవాలని ఉంది' ఓ వృద్ధురాలి ఎదురు చూపు. 'మా మనువళ్లను చూసి చాలా రోజులైంది. నన్ను తీసుకు వెళ్తే వారితో ఆప్యాయంగా మాట్లాడాలనుకుంటున్నాను, వారు ఎలా ఉన్నారో, వెంటనే చూడాలని ఉంది. ఓ వృద్ధుడి ఆత్రం. పండగ అంటేనే అందరూ కలసి జరుపుకొనేది. అందులోనూ సంక్రాంతి మరీ ప్రత్యేకం. పెద్దలు లేనిదే కాంతి లేదు. అయితే సత్తెనపల్లి పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో ఉంటున్న పలువురు పెద్దలు కన్న పేగు పిలుపు కోసం పరితపిస్తున్నారు. తమను సంక్రాంతికి తీసుకు వెళ్తారని ఎదురు చూస్తున్నారు.



సత్తెనపల్లిలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధుల ఎదురు చూపు

వీవీఐటీ విద్యార్థుల జాతి సమైక్యతా నడక 'దర్గా టు దుర్గా'

పెదకాకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు 14వ జాతిసమైక్యత నడక 'దర్గా టు దుర్గా'ను ఆదివారం నిర్వహించారు. గుంటూరు నగరంలోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా వద్ద గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ జెండా ఊపి ఈ సమైక్యతా నడకను ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి జైన్ టెంపుల్, డోలాస నగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కి.మీ. మేర సాగిన ఈ నడకలో కళాశాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు, ఎస్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విభాగాల క్యాడెట్స్ పాల్గొన్నారు. మార్గమధ్యలోని దేవాలయాలు, చర్చిలలో విద్యార్థులు ప్రత్యేక పూజ, ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లడుతూ దేశ సమగ్రత, సమైక్యతను చాటేలా దర్గా టు దుర్గా పేరుతో ఈ నడక నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ గత 14 ఏళ్లగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



'దర్గా టు దుర్గా'ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, పక్కన విద్యాసాగర్

ప్రభుత్వ గ్రాంట్‌తోనే ఏఎన్‌యూలో సకాలంలో జీతాలు

● వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం

పెదకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వ గ్రాంట్ ద్వారానే సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదివారం స్పష్టం చేశారు. ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నవంబర్-2024 జీతభత్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ 5.5 కోట్లు విడుదల చేసిందనీ, ఆ నిధులను ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించినట్లు తెలిపారు. అలాగే నాలుగో విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.17.5 కోట్లను విడుదల చేయగా డిసెంబర్ 2024 జీతాలను సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లిస్తున్నామని వివరించారు. విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా పెన్షన్‌లు సకాలంలో చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా యూనివర్సిటీలో 140 మంది వరకు క్యాజువల్ వర్కర్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఎటువంటి అవసరం లేకపోయినా వీరిని నియమించారనీ, వీరికి ప్రతినెలా జీతాలు చెల్లించే క్రమంలో వర్సిటీపై ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు నిలిచిపోలేదని, వారికి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో ఆర్థిక వ్యవహారాలు పరిగణనలోకి తీసుకుంటే గత మూడేళ్లలో ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో అనేక అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు.

కాలు దువ్వుతున్న కోళ్లు

(3వ పేజీ తరువాయి)

మాంసాహారం, డ్రైఫ్రూట్స్, బిర్యానీలతో పాటు వివిధ రకాల జ్యూస్‌లు అందించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. భారీ సోఫాలు, ఎయిర్‌కూలర్స్‌ను, విద్యుద్దీపాలను, బెలూన్స్‌ను ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట, ఆడే శిబిరాల్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆదివారం తూర్పుపాలెంలో కోడిపందేలను ప్రారంభించారు.

గత వారంరోజులుగా తీరంలో జోరుగా కోడి పందేలు

తీరప్రాంతంలో ఇంత స్థాయిలో కోడిపందేలు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైన చూసే పరిస్థితి లేదు. ఇష్టానుసారంగా పందెలు వేస్తుంటే పట్టించుకోరా అని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తుంటే, రాజకీయనాయకుల ఒత్తిళ్ళ కారణంగా మేము ఏమీ చెయ్యలేకపోతున్నామంటూ అధికారులు చేతులెత్తివేశారు. దీంతో నగరం,రేపల్లె మండలం గుడ్డికాయలంక, నిజాంపట్నం మండలం పల్లపట్ల, అడవులదీవి, కొత్తపాలెం ప్రాంతాల్లో గత వారంరోజులుగా జోరుగా కోడిపందాలు సాగుతున్నాయి. లక్షలాదిరూపాయలు పందాలు జరుగుతుండగా కొంతమంది పందెంరాయుళ్ళు లక్షల్లో నష్టపోయి వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు.

అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

● ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో ఏపీఎల్ క్రికెట్ టోర్నీ
● నెలాఖరుకు విజయనగరంలో క్రికెట్ అకాడమీ
● రూ.50 కోట్లతో వైజాగ్ స్టేడియం ఆధునికీకరణ
● ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో మంత్రి నారా లోకేశ్ ముందుచూపుతో ఉన్నారని చెప్పారు. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రతి ఏటా ఎంపీఎల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో నియోజకవర్గ స్థాయికే పరిమితమైన ఈ టోర్నీని ఏసీఏ సహకారంతో ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కో టీంతోపాటు మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు తలపడుతుందని చెప్పారు. 23వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు అవసరమయ్యే మైదానాలతోపాటు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నామని, విజయనగరంలో ఈ నెలాఖరు నాటికి క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అలాగే అనంతపురంలో మహిళా క్రికెట్ అకాడమీని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమరావతిలో ఇప్పటికే ఉన్న నవులూరు స్టేడియంతోపాటు మరో అంతర్జాతీయ మైదానం కూడా ఏర్పాటు కాబోతుందన్నారు. మంగళగిరి స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవలే మద్రాస్ ఐఐటీ వారితో స్టేడియం నిర్మాణాలను పరీక్షించినట్లు తెలిపారు. ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో ఏపీఎల్ టోర్నీకి సన్నాహాలు చేస్తున్నామని ప్రకటించారు. రాబోయే కాలంలో ఏపీ నుంచి 25 మంది క్రీడాకారులు ఐపీఎల్‌కి ఎంపికయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. విశాఖపట్నం స్టేడియాన్ని రూ.50 కోట్లతో ఆధునికీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ పనులు మార్చి నాటికి పూర్తిచేసి ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం వద్ద ఫోర్ లైన్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి రానున్న బడ్జెట్‌లో అనుమతి రానుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో తన సొంత నిధులతో 147 పాఠశాలల మైదానాలను ఆధునికీకరించి లాంగ్ జంప్ పిట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23న మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా 8 రకాల క్రీడా వస్తువులతో స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్

31న విజ్ఞాన్స్ వర్సిటీలో బాల మహోత్సవం

గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జనవరి 31 నుంచి రెండు రోజుల పాటు ఏర్పాటు చేస్తున్నామని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిన్నారుల పండగ విజ్ఞాన్ బాల మహోత్సవ్ పోస్టర్లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చిన్నారులకు సంబంధించి భారీ బాల మహోత్సవ్ కార్యక్రమానికి యూనివర్సిటీ వేదిక కాబోతోందన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం

గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ వారి ఉన్నతకి కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ చేస్తున్న కృషి అభినందనీయమని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు ఆదివారం స్థానిక కేఏల్పీ పబ్లిక్ స్కూల్లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య అధ్యక్షత వహించారు. జీవీ ఆంజనేయులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఏటా రూ.50 లక్షల వరకు విద్యా ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం అన్నారు. 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలు అందించినట్లు వివరించారు. నాట్కో ఫార్మా వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, బొప్పన ద్వారక ప్రసాద్, పుట్టగుంట వేణుగోపాలరావు, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, డాక్టర్ వడ్లమూడి గోవర్ధన్‌రావు, నామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, డాక్టర్ బసవపున్నయ్య

క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు





జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

ఈపూరు, జనవరి12 (ఆంధ్రజ్యోతి): క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా గ్రామంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. గ్రామస్తులు కలిసికట్టుగా సంప్రదాయ ఆటలు పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, విడపలపాటి హనుమయ్య, కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 564.70 అడుగులు ఉంది. 243.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 8853, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, ఔట్‌ఫ్లో వాటర్‌గా 26,863 విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

సంక్రాంతి శుభాకాంక్షలు

పిడుగురాళ్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనల ద్వారా భోగి, సంక్రాంతి, కనుమ పండువ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు, వారి ఇంట ఈ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.



జోన్ డైరీ

● మండల కేంద్రం దుర్గిలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద సోమవారం సాయంత్రం 4 గంటలకు జనసేన పార్టీ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జనసేన నేతలు కోరారు.

● క్రోసూరులోని వీరభద్ర, మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన ఆవరణలో ఈనెల 18న అచ్చంపేట మండలం ఓర్వకల్లులో వేంచేసి ఉన్న గంగాదేవి పేరంటాలమ్మ తల్లి తిరునాళ్ళకు గాను వివిధ వ్యాపారాల నిర్వహణ హక్కుల కోసం వేలం నిర్వహించనున్నట్టు కార్య నిర్వాహణ అధికారి కోటేశ్వరరావు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ 10వేలు దరవత్తు చెల్లించాలని, పూర్తి సమాచారానికి క్రోసూరులోని దేవాదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

● మాచవరం మండలంలోని వేమవరం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మ శ్రీనివాసరావు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని అన్నారు.

కన్నెగంటి స్వగ్రామంపై కనికరమేది !

- సమస్యలతో గ్రామస్థులు సతమతం
- ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరం
- అధ్వానంగా అంతర్గత రహదారులు
- వీధి దీపాలు లేని వైనం
- తాగునీటికీ అల్లాడుతున్న స్థానికులు
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

పల్నాట స్వాతంత్ర్య ఉద్యమానికి పురుడు పోసుకున్న గడ్డ అది. పల్నాటి బెబ్బులి, పుల్లరి ఉద్యమ నేత కన్నెగంటి హనుమంతు స్వగ్రామం. ఆయన ఖ్యాతిని కీర్తిస్తూ పాలకులు ఢిల్లీలో విగ్రహం కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆయన స్వగ్రామాన్ని అభివృద్ధి పరచడాన్ని విస్మరించారు. కనీసంగా ఆ గ్రామంలో సరైన రోడ్లు లేవు. తాగునీటికి సైతం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి ఏటా కన్నెగంటి జయంతి, వర్ధంతి సమయాల్లో ఆయన విగ్రహానికి నివాళులర్పించి కొనియాడే పాలకులు, అధికారులు ఆయన జన్మించిన గ్రామాన్ని అభివృద్ధి చిత్రపటం నుంచి తొలగించారు.

దుర్గి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):

దుర్గి మండలం మించాలపాడు గ్రామం. పల్నాడు ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమానికి బీజం పండింది అక్కడే. పల్నాటి బెబ్బులి కన్నెగంటి హనుమంతు సారథ్యంలో పుల్లరి వ్యతిరేక ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. అటువంటి చారిత్రక ఖ్యాతిని గడించిన ఈ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మండల కేంద్రమైన దుర్గికి 10 కి.మీ.ల దూరంగా ఈ మించాలపాడు గ్రామం ఉంది. ఈ గ్రామంలో ప్రస్తుతం 150 కుటుంబాలవారు జీవిస్తున్నారు. ఈ గ్రామంలో ఎక్కడా సరైన రహదారి లేదు. గ్రామానికి వెళ్లే మట్టి రహదారిపై గుంతలు ఏర్పడి కొండరాళ్లు బయటకు వచ్చాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైన ఎంతో మంది ద్విచక్ర వాహనదారుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, మిగిలిన వారు వికలాంగులయ్యారు. చిన్నారులు పొరుగూరులో పాఠశాలలకు వెళ్లాలన్నా, గర్భిణులు, వృద్ధులు ఆసుపత్రికి వెళ్లాలన్నా ఆ గుంతల రహదారిలో నరకయాతన పడాల్సిందే.



అధ్వానంగా ఉన్న మించాలపాడుకు వెళ్లే రహదారి

కన్నెగంటి విగ్రహం

మౌలిక వసతులు శూన్యం..

గ్రామాల్లో చాలా వరకు వీధులు సీసీ రోడ్లకు నోచుకోలేదు. మట్టి రోడ్లే అధికంగా ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు రహదారులు బురదమయంగా మారుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. ఓ మోస్తారు వర్షం పడినా వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తూ వాగులను తలపిస్తున్నాయి. గ్రామంలో తాగునీటికి కటకటే. గ్రామ శివారులోని పొలాల్లో వ్యవసాయ బోర్లు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. వర్షాలు పడిన సమయంలో నీరు కలుషితమై అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. గ్రామంలో ఎక్కడా విద్యుత్ దీపాలు లేవు. రాత్రి వేళ విషసర్పాలు గ్రామంలోకి వస్తున్నాయి.

నేతల హామీలు నీటి మూటలే..


కన్నెగంటి స్వగ్రామం నేడు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం రావడమే తప్ప మిగిలిన సమయాల్లో పాలకులు తమ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో ఈసారైనా గ్రామంలో అభివృద్ధి పనులు జరుగకపోతాయా? అని గ్రామస్థులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

రహదార్లు నిర్మించాలి .. కన్నెగంటి కోటయ్య



ఎన్నో యేళ్లుగా గ్రామానికి సరైన రోడ్లు లేవు. ఉన్న రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఏ అవసరానికైనా 10 కి.మీ.ల దూరంలోని దుర్గికి వెళ్లాల్సిందే. గుంతలమయంగా ఉన్న రోడ్లపై ప్రయాణం నరకంగా ఉంది.

తాగునీటి సమస్యను తీర్చాలి.. చిన చెన్నయ్య



గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. గ్రామ శివారులోని పొలాల్లోంచి నీటిని తెచ్చుకుంటున్నాం. గ్రామంలో బోరులు వేయించాలి. అలాగే గ్రామంలో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలి.



రహదారిపై వర్షపునీరు (ఫైల్)

అమరావతి ఎస్‌హెచ్‌వోగా అచ్చయ్య

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి) అమరావతి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా యంపరాల అచ్చయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీలో విధులు నిర్వహిస్తూ బదిలీపై అమరావతి సీఐగా రావడం జరిగింది. బాధ్యతలు తీసుకున్న అచ్చయ్యను ఎస్ఐలు రాజశేఖర్, అమీర్‌లు, సిబ్బంది కలసి అభినందనలు తెలియజేశారు.

అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు

దుర్గి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లలో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. కోడిపందేలు, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. మద్యం మత్తులో రోడ్లపై హల్‌చల్ చేసినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రెంటచింతల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని నేషనల్ హైవే సమీపంలోని మిట్టగుడిపాడు వెళ్లే రహదారి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని గోలి గ్రామానికి చెందిన ముళ్లపాటి శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు తలకు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గుల పోటీలు..

దాచేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వాసవి సేవా సమితి సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం దాచేపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి తాడేపల్లి రేణుకకు బంగారు షాపు యజమాని స్వామి శ్రీనివాసరావు, ద్వితీయ స్థానంలో కాకుమాను పద్మావతికి ఊటుకూరి శ్రీనివాసరావు, తృతీయ బహుమతిని మునిగండ్ల సుభాషినికి కలవల రమేష్ అందజేశారు. న్యాయనిర్ణేతగా ప్రభుత్వ వైద్యురాలు ఇమ్మడిశెట్టి అమూల్య వ్యవహరించారు. కార్యక్రమంలో గర్నె పుల్లారావు, పెనుగొండ అమృతలింగేశ్వరరావు, కనిగిరి విశ్వనాథం, మండ్లెం రామారావు, ముక్కంటి, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

● ముగ్గురుని పట్టుకున్న పోలీసులు

గోకవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ ముగ్గురు దొంగలు పోలీసులకు పట్టుబడగా మరో దొంగ పరారీలో ఉన్నాడు. డీఎస్పీదేవకుమార్, సీఐ సత్యకుమార్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఏపూరి బెనర్జీ, నరసరావుపేటకు చెందిన రాచపూడి రాకేష్, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన కొత్త గణేష్ ఈ నెల 10న కారుపై తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన గోకవరం వచ్చి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను చూసి కారులో పారిపోయే ప్రయత్నం చేయబోయారు. ఇంతలో ఎస్ఐపవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గుమ్మళ్ళదొడ్డి సమీపంలో కారును చుట్టుముట్టి పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన శ్యామ్‌సన్ పరారీలో ఉన్నాడని, అతడిపై గతంలో అనేక కేసులున్నాయన్నారు. జరిగిన ఘటనపై బ్యాంక్‌మేనేజర్ కందుకుర్తి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సత్యకుమార్ తెలిపారు.

నేరచరితులను పోటీకి దూరంగా ఉంచాలి

● జై భారత్ నేషనల్‌పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ

మాచర్లటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేర చరిత్ర కలిగిన వ్యక్తులను ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంచాలని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన మాచర్లలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల్లో డబ్బు ప్రవాహం పెరిగిపోయిందన్నారు. ఎన్నికల్లో కులం, మతం, ప్రాంతం, డబ్బు తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలన్నారు. పార్టీ ఫిరాయింపులు, నేర చరిత్ర కలిగిన వారు ఎన్నికల్లో పోటీచేసి ప్రజా ప్రతినిధులవడం, ఆచరణ సాధ్యంకాని ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల వాగ్దానాలు చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం చేస్తున్నాయన్నారు. ప్రతి పక్షం లేకుండా ఏకపక్షం గెలుపు కూడా ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఒక పార్టీ తరుపున గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించిన వారిపై స్పీకర్ వెంనే చర్యలు తీసుకొని అనర్హులుగా ప్రకటించాలన్నారు. ఈవీఎంలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, వాటిని సవివరంగా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉందన్నారు. ప్రతిపక్షంలో ఒక్క ఎమ్మెల్యే ఉన్నా అసెంబ్లీకి వెళ్లి తన వాణి వినిపించాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలో చాలా వివాదాస్పదంగా కథనాలు వినిపించాయని, వివేకానందుని స్ఫూర్తితో యువత చైతన్యవంతమై ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాలని లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. ఆయనతోపాటు రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు మేడం నాగేశ్వరరావు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

వైసీపీ సమన్వయకర్తగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజక వర్గ వైసీపీ సమన్వయ కర్తగా నరసరావుపేటకు చెందిన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిని నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల అనంతరం వైసీపీకి నియోజకవర్గంలో సమన్వయ కర్తలేరు. అప్పటి వరకు వైసీపీ సమన్వయ కర్తగా పని చేసిన అంబటి రాంబాబును గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

క్రోసూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని పలు ప్రదేశాల్లో ఆదివారం సాయంత్రం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. అమరావతి బస్టాండ్ సెంటర్, నాలుగు రోడ్ల సెంటర్‌లలో ఎస్ఐ నాగేంద్ర బాబు ద్విచక్ర వాహన దారులకు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే పోలీసుస్టేషన్‌లో సీఐ పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో పలుగ్రామాలపెద్దలతో సమావేశం నిర్వహించి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదం వంటి కార్యకలాపాల కట్టడికి సహకరించాలని సీఐ కోరారు.

గోకులంతో పాడి రైతుకి భరోసా

దాచేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాడి రైతుల అభ్యున్నతి కోసమే మినీ గోకులాల నిర్మాణాలను చేపడుతోందని టీడీపీ యువ నేత నెల్లూరి రామకోటయ్య అన్నారు. ఆదివారం దాచేపల్లి మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. దాచేపల్లి మండలంలో 25 గోకులాలు మంజూరు కాగా, 10 పూర్తయ్యాయని, 14 నిర్మాణంలో ఉన్నాయని, నిర్మాణం మొదలు కానివి ఒకటి ఉన్నట్లు ఏపీవో మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కిచ్చంశెట్టి లక్ష్మీనారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కిచ్చంశెట్టి పకీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలకు బరులు సిద్ధం

● బేఖాతరవుతున్న పోలీసు హెచ్చరికలు

పెదకూరపాడు, జనవరి12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సమీపించిన నేపథ్యంలో కోడి పందాల నిర్వాహకులు బరులుసిద్ధం చేసుకుంటున్నారు. ఒక వైపు కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీచేసినా వారి హెచ్చరికలకు తగ్గేదేలే అన్నట్టు అధికార పార్టీ నేతలు బరులు ఏర్పాటు చేస్తున్నారు. అమరావతి మండలంలోని లేమల్లె గ్రామంలో, పెదకూరపాడు మండలంలోని ముస్సాపురం గ్రామంలో కోడిపందాలు నిర్వహించేందుకు పొలాలను చదునుచేసి బరులు సిద్ధం చేస్తున్నారు. పోలీసులు సైతం ప్రేక్షక పాత్ర వహించాల్సిన పరిస్థితిపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.



మొక్కలు నాటుతున్న కాంతారావు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● సాగర్ కుడికాలువ డీసీ చైర్మన్ కాంతారావు

గురజాలటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహద పడాలని నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో ఆదివారం మండలంలోని చర్లగుడిపాడులో వెల్ఫేర్ ఆర్గనైజర్ బిక్కీ ఆలేఖ్య వరప్రసాద్ ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు ఉచితంగా మొక్కలు అందించగా, మహిమ ఆశ్రిత ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ ఆధ్వర్యాన ట్రీగార్డులను అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పులుకూరి కాంతారావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, ఎస్ఐ వినోద్‌కుమార్, బిక్కీ పూర్ణచంద్రరావు, పల్వూరి నాగేశ్వరరావు, గంధం నాగేశ్వరరావు, వేముల రామకృష్ణ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

నకరికల్లు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆటో బోల్తా కొట్టిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన నకరికల్లు సమీపాన గల ఆర్‌యూబీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని గుండ్లపల్లి గ్రామం నుంచి ప్రయాణీకులను ఎక్కించుకొని నకరికల్లు వైపు ఆటోవస్తుండగా కోతుల గుంపు ఆకస్మాత్తుగా ఆటోకి ఎదరు రావడంతో డ్రైవర్ వాటిని తప్పించే ప్రయత్నం చేయగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ మౌలాలికి తీవ్ర గాయాలవడంతో అతనిని 108 వాహనంలో నరసరావుపేట ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ పెద్దిసీడి శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

బెల్లంకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రాజుపాలెం గ్రామ శివారు తోటల్లో ఆదివారం కోడి పందేలు వేస్తున్నట్లు సమాచారం అందటంతో దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని, పుంజులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిందితులైన జడ సుబ్బారావు, వల్లెల శ్రీనివాసరావు, సైదయ్య, గోపిరాజు, ఎం సుబ్బారావులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో సిబ్బంది ఎల్ వెంకటేశ్వరరావు, రాజేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు
● వివిధ ప్రాంతాల్లో జయంతి కార్యక్రమాలు

సత్తెనపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నరసరావుపేట లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. సత్తెనపల్లిలో నవచైతన్య వివేకా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వామివివేకానందం జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల్లోని భారతీయ యువతను తన ప్రసంగాలు, రచనలతో వివేకానందం ఉత్తేజ పరిచారని, స్వాతంత్ర్య ఉద్యమంలో యువత నడిచేలా చేశారన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నోముల వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం లో దివ్వెల శ్రీనివాసరావు, బుడగాల సుబ్బారావు, దూపగుంట్ల జానకి రామారావు, దరువూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్వామి వివేకానందం చైతన్య భారతీ ఆధ్వర్యంలోనూ జయంతిని నిర్వహించారు.



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయులు

అమరావతి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌వీవీఎన్ కళాశాల పరిధిలోని శ్రీధాన్యకటక జేఈఈ ఎన్ఈఈటీ అకాడమీలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవ కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ముందుగా ఆయన స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఇంటర్ బోర్డు అధికారి వీ.యర్రయ్య, అకాడమీ ప్రిన్సిపాల్, డైరెక్టర్లు శివప్రసాద్, అప్పారావు, రామిరెడ్డి, దేవ, కళాశాల కరస్పాండెంట్ జాజిబాబు, వావిలాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీరామ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన స్వామి వివేకానంద 163వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగావున్న స్వామి వివేకానంద విగ్రహానికి గురజాల డీఎస్పీ జగదీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి సెక్రటరీ పోలిశెట్టి పుల్లారావు, ఉపాధ్యక్షులు శివశంకర్‌ప్రసాద్, కోటిరెడ్డి, చింతపూడి వెంకటేశ్వరరెడ్డి, చినలాలుసాహెబ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అమరావతిలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు వివేకానంద చిత్రపటంతో ప్రధానవీధిలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వరశర్మ, గిరిస్వామి, ఆర్ సత్యనారాయణ, కే.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ హనుమంతరావు హెచ్చరిక

సత్తెనపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండువ సందర్భంగా సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట మండలాల్లో సంక్రాంతి పండుగ ముసుగులో కోళ్ళకు కత్తులు, బ్లేడ్లు కట్టి పందేలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. అలా నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కోడి పందాలు, పేకాట లాంటి సమాచారం స్థానిక ప్రజలకు తెలిస్తే తమకు తెలియ జేయాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



డ్రోన్ కెమెరా పనితీరుపై ట్రయిల్ నిర్వహిస్తున్న సీఐ భాస్కర్

పందేలపై డ్రోన్ కెమెరాల నిఘా

గురజాలటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంటుందని సీఐ ఆవుల భాస్కర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని బ్రహ్మనాయుడు సెంటర్లో ఎస్ఐ వినోద్‌కుమార్‌తో కలిసి డ్రోన్ కెమెరాల పనితీరుపై ట్రయిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ సంక్రాంతి పండువను పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుందని, పట్టణం, మండలం చుట్టుపక్కల గ్రామాలతోపాటు అటవీ ప్రాంతంలో కూడా డ్రోన్ నిఘా నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని వీడియో ఆధారంగా అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ భాస్కర్ హెచ్చరించారు.

మాచవరం,(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండువను పురస్కరించుకొని మండల పరిధిలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే ఆయా గ్రామాల రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ తహసీల్దార్ క్షమారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో కోడి పందేలు జరగకుండా చూడాలని, ఎక్కడైనా పందేలు నిర్వహిస్తున్నట్టు దృష్టికివస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శివనాగమల్లేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

రాజుపాలెం,జనవరి12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండువ సందర్భంగా మండలంలోని గణపవరం గ్రామంలో స్థానిక తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గస్థాయి వాలీబాల్ టోర్నమెంటు ప్రారంభమైంది. ఈ టోర్నమెంటును టీడీపీ నియోజకవర్గ నేతలు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మర్రి వెంకట్రామిరెడ్డి, వడ్డెంపూడి వెంకట్రావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నర్రా మల్లయ్య, పెద్ద రాఘవయ్య, సుబ్బారావు, కుర్రా మల్లి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

రెంటచింతల,జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మంజూరు చేసిన మినీ గోకులాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడేలా వృద్ధిలోకి రావాలని టీడీపీకి చెందిన మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి కోరారు. ఆదివారం రెంటచింతలతో పాటు రెంటాల గ్రామంలో నిర్మించిన గోకులాలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, తుమ్మామర్రెడ్డి, ఏపీవో జయచంద్ర, కార్యదర్శి కోటేశ్వరరావు, లబ్దిదారులైన మల్లయ్య, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేస్తా

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

మాచర్ల రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేస్తానని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవంలో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్స్, కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎంతగానో పోరాటం చేశానని గుర్తు చేశారు. తనను గెలిపిస్తే మాచర్ల ప్రాంతంలో పీజీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ కోసం గతంలో ఎన్నోసార్లు ఉద్యమాలు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి అంజనేయులు నాయక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాసర్‌రెడ్డి, జేవీకేఎస్ ప్రసాద్, గాదె కిరీటిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.



తుమ్మకోట జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థుల సమావేశం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రెంటచింతల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తుమ్మకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ ఆదివారం ఆ పాఠశాలలో పూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి సంగతుల్ని గుర్తు చేసుకుని ఆనందడోలికల్లో మునిగి తేలారు. నూనూగు మీసాల వయస్సులో విడిపోయి నేడు భార్య పిల్లలతో కలుసుకుని మధురానుభూతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈసందర్భంగా వారికి విద్యాబుద్దులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ఎం.కృష్ణమూర్తి, అబ్దుల్ సలీం, పోట్ల శైలజ, రవీంద్రయాదవ్, రామకృష్ణ, సైదావలి, ఉపాధ్యాయులైన సాయిబాబ, దుర్గాసౌజన్య, చక్రపాణి,జాన్, ఈశ్వరయ్య, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆదివారం 2010 - 11 విద్యాసంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు వారి ఉపాధ్యాయులను ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, గోపీ, మంగయ్య, కోటేశ్వరరావు, విజయ కుమార్, రమేష్, ప్రభాకర్, శివరాజ, పూర్వ విద్యార్థులు అనీల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో సమాజంలో గౌరవం, గుర్తింపు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా సమాజంలో ఒక మంచి గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 26న 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభమైనదని చెప్పారు. పార్టీ శాశ్వత సభ్యత్వం పొందిన వారు పుల్లారావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆయన అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు 45మంది రూ.1లక్ష చొప్పున చెల్లించి, శాశ్వత సభ్యత్వం తీసుకున్నారని ఆయన తెలిపారు. రూ.100లు చెల్లించి తీసుకునే సభ్యత్వంతో రూ.5లక్షల బీమా ప్రయోజనం, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు, విద్యాభ్యాసం వంటి ఎన్నో ప్రయోజనాలు పార్టీ అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు నందిగం శ్రీనివాసరావు, రంగనాథుల నాగేశ్వరరావు, కందిమళ్ళ రఘు రామారావు, కామినేని సాయిబాబు, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, ఈదర సాంబశివరావు పాల్గొన్నారు.

26న మెగా వైద్య శిబిరం

చిలకలూరిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాటూరి వైద్య కళాశాల సహకారంతో స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కాటూరి ఆసుపత్రి వారి అత్యాధునిక నూతన టెక్నాలజీతో సీబీపీ, సీయూఈ, ఈసీజీ, ఎక్సరే, డెంటల్ ఎక్సరే, బోన్ డెన్సిటీ, నేత్ర పరీక్షలతో పాటు ఇతర అన్ని రకాల పరీక్షలు చేసే వీలున్నదన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు విజయవాడ, గుంటూరు వెళ్లే అవసరం లేకుండా ఈ శిబిరానికి హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా కాటూరి ఆసుపత్రి ఛైర్మన్ కాటూరి సుబ్బారావును ప్రత్తిపాటి ఆదివారం కలిసి ఆసుపత్రిని పరిశీలించారు.

నలుగురికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నలుగురికి రూ.2.28 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం తన నివాస గృహంలో అందచేశారు. కార్యక్రమంలో పాస్టర్ నందమూరి క్రిస్టఫర్, టీడీపీ నాయకులు ఎస్ఎస్ సుభాని, మద్దుమాల రవి పాల్గొన్నారు.

ముగ్గురు రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు

శావల్యాపురం, జనవరి12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురు రెవెన్యూ అధికారులకు తహసీల్దార్ సుజాత ఆదివారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పేరుసోముల నాసరయ్య మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో చేపట్టిన రీసర్వే పనులకు హాజరుకాకుండా కార్యాలయంలోనే గడుపుతున్న కారణంగా తహసీల్దార్ ఆయనకు మెమోను జారీ చేశారు. రీసర్వేలో పనుల పురోగతిని ప్రతిరోజూ సాయంత్రం 6గంటలలోపు తహసీల్దార్‌కి తెలియజేయాలని, లేకపోతే నాసరయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు నివేదికని అందజేస్తామని హెచ్చరించారు. కొత్తలూరు వీఆర్వో ఉప్పుటూరి చినమంగయ్య, పోట్లూరు వీఆర్వో లక్ష్మీప్రసన్న పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గడువు ముగిసినా క్షేత్రస్థాయి విచారణ నివేదికలు సమర్పించకపోవడంతో తహసీల్దార్ వారిరువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 16వ తేదీలోపు ఇద్దరు వీఆర్వోలు తహసీల్దార్‌కు ఈ విషయంపై వివరణ ఇవ్వాలని, లేకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు అపూర్వ స్పందన

నరసరావుపేట టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కేసానుపల్లిలో ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్కాలర్‌షిప్ పరీక్షకు అపూర్వ స్పందన లభించిందని ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ ఆదివారం తెలిపారు. ఈ పరీక్షకు 978మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ, అంకితభావం అలవర్చుకోవాలన్నారు. ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సంగీతం, యోగ వంటి వాటిలో శిక్షణ ఇవ్వడం వలన శారీరక, మానసిక ఉల్లాసం పొందుతారని తెలిపారు. స్కూల్ జనరల్ మేనేజర్ సీహెచ్ రామరాజు, ఏవో రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో ఆకట్టుకున్న ఇంద్రజాలం



తలను వేరుచేసిన మొండెంతో మెజీషియన్ బీఎస్ రెడ్డి

నరసరావుపేట కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంద్రజాలం విశేషంగా ఆకట్టుకుంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండో రోజు జరిగిన కార్యక్రమాల్లో ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో భాగంగా తొలుత దాక్షిణ్య ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటలెక్చువల్లీ డిజేబుల్డ్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, డాన్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. దాక్షిణ్య వ్యవస్థాపకుడు టీవీరావును, చిన్నారులను తీర్చిదిద్దిన ఆ సంస్థ ఉపాధ్యాయులను అందరూ అభినందించారు. దాక్షిణ్య నిర్వాహకులను ముఖ్యఅతిథులు సత్కరించారు. కార్యక్రమంలో పౌరాణిక నటుడు, గాయకుడు ఆదాం ఆలపించిన పద్యాలు అలరించాయి. కాగా కార్యక్రమానికి హేమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా జడ్జి ఎన్.సత్యశ్రీ, పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కళావేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అధ్యక్షుడు గిరిరాజు అయ్యపరాజు, కార్యదర్శి మురారిశెట్టి గోపాలబాబు, ఇతర సభ్యులు నిర్వహించారు.

స్విమింగ్ పోటీల్లో ఎస్ఎస్ఎన్ విద్యార్థి ప్రతిభ



ట్రోఫీతో ఎస్.జగదీశ్

నరసరావుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ స్విమింగ్ పోటీల్లో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ ఆదివారం తెలిపారు. ఎస్ జగదేశ్ వేలు మీటర్ల ఈత పోటీల్లో రన్నర్స్ అప్ ట్రోఫీతోపాటు 4/100 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే పోటీల్లో రజిత పతకం సాధించారన్నారు. విజేతగా నిలిచిన ఎస్ జగదీశ్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెట్ నాగసరపు సుబ్బరాయగుప్త, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వూటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు తదితరులు అభినందించారు.


ఏటీఎంలో చోరీకి వచ్చి దొరికిపోయారు...

● పల్నాడు జిల్లాకు చెందిన ముగ్గురి పట్టివేత

గోకవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ ముగ్గురు దొంగలు పోలీసులకు పట్టుబడగా మరో దొంగ పరారీలో ఉన్నాడు. డీఎస్పీ దేవకుమార్, సీఐ సత్యకుమార్ వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఏవూరి బెనర్జీ, నరసరావుపేటకు చెందిన రాచపూడి రాకేష్, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన కొత్త గణేష్ ఈ నెల 10న కారులో తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రం గోకవరం వచ్చి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గస్తీ ని ర్వహిస్తున్న పోలీసులను చూసి కా రులో పారిపోయే ప్రయత్నం చేశారు. ఇంతలో ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గుమ్మళ్ళదొడ్డి సమీపంలో కారును పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన శ్యామ్‌సన్ పరారీలో ఉన్నాడు. అతడిపై గతంలో అనేక కేసులున్నాయన్నారు. బ్యాంక్ మేనేజర్ కందుకుర్తి సతీష్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధితోనే పేదరిక నిర్మూలన

● జస్టిస్ లావు నాగేశ్వరరావు



పైలాన్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి, ఇన్‌సెట్‌లో సభలో మాట్లాడుతున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు

చిలకలూరిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధితోనే పేదరిక నిర్మూలనకు అవకాశం ఉన్నదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు ఆదివారం అన్నారు. స్థానిక సేవా సంస్థ అసిస్ట్ ఆపరేషనల్ డైరెక్టర్ డాక్టర్ జాస్తి రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవ ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. దేశ జనాభాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 60శాతం మంది వరకు ఉన్నారని, వారికి ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు చేయూతనివ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు. 50 సంవత్సరాల పాటు నిరంతర సేవలను అందించి గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన డాక్టర్ రంగారావును ఆయన అభినందించారు. రంగారావు, ప్రమీల దంపతులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అసిస్ట్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ వడ్లమాని రవి, కోశాధికారి ముత్తినేని వెంకటేశ్వర్లు, అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరీష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

పైలాన్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి

డాక్టర్ జాస్తి రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మోపిదేవి వెంకటరమణ, గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ రంగారావు సేవా ప్రస్థాన పైలాన్‌ను మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. సభలో గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేకించి ఉభయ గుంటూరు, ప్రకాశం జిల్లాలలో డాక్టర్ రంగారావు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. రంగారావు సేవా ప్రస్థానానికి సంబంధించిన ఎగ్జిబిషన్‌ను మంత్రి, నాయకులు తిలకించారు.

వైభవంగా పట్టాభి సీతారామస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభి సీతారామస్వామి వారి గ్రామోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతర స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాగసరపు రూపేష్ గుప్తా, నాగసరపు రాందేవ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం సత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు సత్కారం

నరసరావుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని శ్రీసూర్య భగవాన్ నిత్య అన్నదాన సేవా సంఘం సూర్య బలిజ సత్రాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కాగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు కలిశారు. స్వామి వారి నూతన క్యాలెండర్, డైరీ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పూనాటి నాగవర్ధినికి ఎమ్మెల్యే నివాళి

నరసరావుపేట రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పూనాటి అంజనేయులు సతీమణి పూనాటి నాగవర్ధిని శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురవాయపాలెంలో నాగవర్ధిని మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరావు, పూనాటి బ్రహ్మయ్య, చుండ్రు ముత్తయ్య, జాగర్లమూడి హనుమంతరావు, ఆలపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి వారి తులసీవనం గేటెడ్ నూతన వెంచర్ ప్రారంభం



తులసీవనం గేటెడ్ నూతన వెంచర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పురప్రముఖులు

వినుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రగడ్డపాడు సమీపంలో హైదరాబాద్ శ్రీనిధి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన 50 ఎకరాల్లో తులసీవనం గేటెడ్ నూతన వెంచర్ బ్రోచర్‌ను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, త్వరలో పట్టణానికి ఆనుకొని బైపాస్ కూడా రావడం రానుందన్నారు. తులసీవనం వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసి ఇల్లు కట్టుకునే వారికి బ్యాంకు లోను వచ్చేలా అన్ని అప్రూవల్, సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే శ్రీనిధి ప్రాజెక్టు ఎండీ జెడ్డా వెంకటరావు మాట్లాడుతూ హైదరాబాద్‌లో పలు వెంచర్లు అభివృద్ధి చేశామని, పట్టణానికి సమీపంలోగల చాట్రగడ్డపాడులో మొదటిసారిగా 50 ఎకరాల తులసీవనం, మెగా రెసిడెన్షియల్ గేటెడ్ వెంచర్‌ను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని, ఇంటర్నేషనల్ స్కూల్‌ను స్థాపించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఎకరం స్థలంలో జిల్లాలోనే మొట్టమొదటిసారిగా వెస్ట్రన్ క్లబ్‌హౌస్ రిసార్ట్స్, జిమ్, సైక్లింగ్ ట్రాక్ తదితర వసతులతో వెంచర్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ మాదినేని ఆంజనేయులు, డీసీ ఛైర్మన్ ముత్తినేని కొండలు, మున్సిపల్ కౌన్సిలర్ వీ లింగమూర్తి, పత్తి పూర్ణ, జెడ్డా రామయ్య, మాజీ జడ్పీటీసీ సుబ్బారావు, మాజీ ఎంపీపీలు లగడపాటి వెంకటరావు, కొమ్మ శ్రీను, నంబుల గుర్నాథం, తులసీవనం మేనేజింగ్ పార్టనర్స్ ముత్తినేని యశోదరావు, ఎస్కే సలాం, ఈ సైదా పాల్గొన్నారు.

సమాజ రుగ్మతలను చాటిన కవి గుర్రం జాషువా

● విద్యావంతుల వేదిక ప్రారంభ సభలో ప్రొఫెసర్ కాసిం



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాసిం

వినుకొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజ రుగ్మతలను వెలుగెత్తి చాటిన గొప్పకవి గుర్రం జాషువా అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు అకాడమి అధిపతి ప్రొఫెసర్ సీహెచ్ కాసిం అన్నారు. పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డులో న్యాయవాది లూకా అధ్యక్షతన విద్యావంతుల వేదికను ఆదివారం ప్రారంభించారు. ముందుగా రైల్వే స్టేషన్‌రోడ్డులోని బిక్కి రాములు స్తూపంపై ఉన్న అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రొఫెసర్ సీహెచ్ కాసిం మాట్లాడుతూ పద్యంతో సాహిత్య కవులను ఒప్పించిన గొప్ప కవి జాషువా అన్నారు. దళిత కుటుంబంలో జన్మించి కవిత్వానికి పునాది వేశారని, పద్యానికి జాషువా, విప్లవానికి గద్దర్ ప్రాణం పోశారన్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ వంటి కవులు ఏలుతున్న రోజుల్లో దళితుడిగా తన కలంతో సమాజంలో రుగ్మతలు ఎలుగెత్తి చాటారన్నారు. దళిత కవిత్వానికి పునాది వేశారన్నారు. ఎయిమ్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్‌కు సాహిత్యంలో నోబుల్ బహుమతి ఇవ్వాలన్నారు. 70సంవత్సరాల గద్దర్‌కు హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్ చేయడంపై కుట్ర దాగివుందని విమర్శించారు. గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ మాట్లాడుతూ తమ తండ్రి నిరుపేదల సమస్యల కోసం కడవరకు పోరాడారన్నారు. అనంతరం ఆమె ఆలపించిన గేయం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు, న్యాయవాది సీహెచ్‌ఎల్ఎన్ మూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కోల నవజ్యోతి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు సంధ్య, బిక్కిరాములు సతీమణి మంగమ్మ, విజయ్, రూబేన్, సంపత్‌కుమార్, డాక్టరు శాంతిరేఖ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇయర్ ప్రాతిపదికగా బదిలీలు జరపాలి

● పల్నాడు ప్యాఫ్టో ఛైర్మన్ బెజ్జం సంపత్ బాబు

నరసరావుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలోని ఉపాధ్యాయులకు త్వరలో చేయదలచిన బదిలీలకు సంబంధించి రూపొందిస్తున్న చట్టంలో అకడమిక్ ఇయర్‌ను ప్రాతిపదికగా ఉపాధ్యాయుల సర్వీసును లెక్కించాలని పల్నాడు జిల్లా ప్యాఫ్టో ఛైర్మన్ బెజ్జం సంపత్‌బాబు ఆదివారం డిమాండ్ చేశారు. 2017 నుంచి అమలులో ఉన్న ఈ విధానాన్ని వదిలి కటాఫ్ తేదీ ప్రాతిపదికన బదిలీలు చేస్తే పల్నాడులాంటి పెద్ద జిల్లాలో మూరుమూలప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, 2023లో ప్రమోషన్ పొందిన సీనియర్లకు న్యాయంజరిగే అవకాశం లేదన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

వినుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మానవసేవా సమితి కార్యనిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సురేష్‌బాబు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు నాగార్జున, రాంబాబు, సాదిక్, చందు, బ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ రూపకు సన్మానం

నరసరావుపేట టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఆర్యవైశ్య అన్నదాన నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా జనసేన వీర మహిళ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెను జనసేన నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో అద్దేపల్లి ఆనంద్, కృష్ణంశెట్టి గోవిందు, గుప్తా శ్రీకాంత్, కృష్ణంశెట్టి సిద్దయ్య, కనకం కిషోర్, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా నాటకోత్సవాలు

వినుకొండటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని పెదకంచర్ల గ్రామంలో ఆరో నాటకోత్సవం గ్రామ కళాపరిషత్, రోటరీక్లబ్ ఆఫ్ వినుకొండ ఆధ్వర్యంలో 13వ తేదీ రాత్రి 8గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13నుంచి ఈ నెల 15వరకు నాటకోత్సవాలు ప్రదర్శించనున్నట్లు వారు తెలిపారు. మొదటి నాటిక చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, 14న ఉషోదయ కళానికేతన్ కాట్రపాడువారి విముక్తినాటిక, మూడో ప్రదర్శన డీఎస్పీ ఆర్కెస్ట్రా, చందుడ్యాన్స్ అకాడమీ అనూష బృందం ఒంగోలువారి క్లాసికల్, సెమీక్లాసికల్, జానపద నృత్యరూపకం, గుంటూరువారి అమరావతి ఆర్ట్స్ చిగురుమేఘం నాటిక.., 15న ముత్తినేని క్రియేషన్స్ రారాజు సుయోధన నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

పారిశుధ్య కార్మికులకు మందులు పంపిణీ

చిలకలూరిపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో భాస్కర్ సెంటర్‌లో ఉన్న వివేకానంద విగ్రహానికి పూ లమాలలు వేసి నివాళులు అర్పించారు. పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు ఉత్తమ సేవాపురస్కార జ్ఞాపికలను చెంచయ్య, పోతురాజు, దాసరి అంజిలకు అందచేశా రు. పారిశుధ్య కార్మికులకు మల్టీ విటమిన్ టాబ్లెట్లు, టవల్స్‌ను అర్బన్ సీఐ రమేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, శానిటరీ మేస్త్రులు భైరా సతీష్, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఒకరు మృతి

నరసరావుపేట రూరల్, జనవరి 12: నరసరావుపేట - పిడుగురాళ్ళ ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం రావిపాడు గ్రామం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని చెట్టును ఆదివారం ఢీకొంది. ఈ ప్రమాదంలో విలేఖరిగా పనిచేసే చిలకలూరిపేటకు చెందిన గాదె అంజిరెడ్డి మృతి చెందాడు. పిడుగురాళ్ళలోని బంధువుల వద్దకు వెళ్లి చిలకలూరిపేటకు తిరిగివస్తుండగా మార్గమధ్యలో ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు భువన, పల్నాడు జిల్లా మీడియా అసోషియేషన్ నేతలు అంజిరెడ్డి మృతదేహానికి నివాలులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు

సీఐ శోభనబాబు

వినుకొండ టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఎవరైన కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ శోభనబాబు తెలిపారు. ఇప్పటికే అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ నిఘా ఏర్పాటుచేశామని, ప్రతి గ్రా మంలో పోలీస్‌నిఘా ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కోడి పందాల బరుల తొలగింపు

నాదెండ్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో కోడి పందాలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన బరిని నాదెండ్ల పోలీసులు ఆదివారం తొలగించారు. సాతులూరు గ్రామం నుంచి బుక్కాపురం పోయే రహదారిలో రైల్వే గేటు సమీపంలో జగనన్న కాలనీలో కోడి పందాలు నిర్వహించేందుకు బరిని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది అధికార పార్టీ నాయకులు సోమవారం నుంచి కోడి పందాలు నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ పుల్లారావు, సిబ్బంది బరిలో ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు.

● రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెంలో కోడి పందాల బరిని పోలీసులు ఆదివారం ట్రాక్టర్‌తో దున్ని వేయించారు. కొనకంచివారిపాలెంలో బరులకు ఏర్పాట్లుచేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ అశోక్ సిబ్బంది ఆ ప్రదేశానికి వచ్చారు. అక్కడ కోడిపందాల నిర్వహణ కోసం చేస్తున్న ఏర్పాట్లను తొలగించారు. కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జూదాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ హెచ్చరించారు.

తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి జరుపుకుందాం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి పండగ జరుపుకుందాం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం పిలుపునిచ్చారు. తెలుగువారు జరుపుకునే అతిపెద్ద పండుగలలో సంక్రాంతి పండుగ ఒకటన్నారు. నేటి కాలంలో పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ తగ్గిపోతోందని, కనుక ప్రతి ఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలు పిల్లలకు తెలిసేలా సంక్రాంతి పండుగను జరుపుకోవాలన్నారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం

నరసరావుపేట లీగల్, జనవరి 12: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రధాన కూడళ్ళలో ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల కట్టడి కోసం ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

భోగి పండుగ సందర్భంగా ఈనెల 13వ తేదీ సోమవారం సెలవు నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికను రద్దు పరచినట్లు ఎస్పీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

సద్ది వితరణ ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు

వినుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారణ స్వాములకు 82రోజులు సద్ది వితరణ ముగింపు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు 18 మెట్ల జ్యోతిని వెలిగించారు. అనంతరం ఆలయ కమిటీ ధర్మకర్త చినగుర్నాథంతో పాటు అన్నదాన కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి నాడు అయ్యప్పస్వామి దేవస్థానంలో మకరజ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని భారీస్థాయిలో జరుపుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్‌శర్మ, సూరాబత్తుని హనుమంతరావు, జెట్టి తిరుపతిరావు, డాక్టర్ ఎల్ఎన్‌రావు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నగరవనం ప్రవేశం

వినుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని వెంకుపాలెం సమీపంలో నగరవనానికి అతితక్కువ రేట్లతో ప్రవేశం కల్పించనున్నట్లు వినుకొండ రేంజ్ అధికారి మాధవరావు ఆదివారం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాల నుంచి ఇంటికి వచ్చే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు పలు క్రీడా పరికరాలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

తెలుగుకీర్తి పురస్కారాలకు కారుమంచి గాయని ఎంపిక



గాయని నాగమణి

కారుమంచి(శావల్యాపురం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన విజయవాడలోని శ్రీ కౌతా పూర్ణానంద్ విలాస్ కళావేదికలో జరగనున్న తెలుగుకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలకు శావల్యాపురం మండలం కారుమంచికి చెందిన ప్రముఖ గాయని, స్వర్ణజ్యోతి అవార్డు గ్రహీత రావినూతల నాగమణిని ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక సీఈవో, ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆదివారం ప్రత్యేక ఆహ్వానాన్ని పంపారు. నాగమణి చిన్నతనం నుండే ఉత్తమ గాయనిగా పేరు ప్రఖ్యాతులు సాధించింది. తెలుగు, కన్నడ, మళయాల, హిందీ భాషల్లో 15వేల పైచిలుకు సినీగేయాలను పాడి ప్రేక్షకుల ఆదరాభిమానాలను సొంతం చేసుకొంది. జాతీయస్థాయిలో జూనియర్ జానకమ్మ, స్వర్ణనంది, స్వర్ణకంకణం, లేడీలెజండ్, సంగీతరత్న, సావిత్రీబాయిపూలే, శ్రీకృష్ణదేవరాయలు, ఆణిముత్యం, ఫిలింఫేర్, నంది అవార్డులను పొందింది.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

నూజెండ్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం శ్రీ వెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్‌లో 1997-98 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ఆదివారం అప్పటి మధుర స్మృతులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన రూ.లక్ష విలువ చేసే ఫర్నిచర్‌ను అందించారు.